క్లుప్తంగా

బ్యూటీపార్లర్ కోర్సుపై మహిళలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోనే మహిళలకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్టు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి 18 నుంచి 45 సంవత్సరాలు కలిగిన మహిళలు అర్హులన్నారు. జూన్ 15 నుంచి నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, ఉచిత భోజనం పూర్తిగా ఉచితం అన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లా వాసులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని వారు అర్హులు కాదని తెలిపారు. శిక్షణతో పాటు వ్యాపార నిర్వహణ, ఖాతాల నిర్వహణ, సంభాషణ నైపుణ్యాలతో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్‌లతో పాటు తెల్ల రేషన్ కార్డ్, ఆధార్‌కార్డ్ 4 పాస్‌పోటోలతో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం బైపాస్ సంగారెడ్డి నందు సంప్రదించవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 9490103390, 9490129839 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

మునిపల్లి(అందోల్): జూన్ 1వ తేదీన మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు పిల్లోడి గ్రామ సర్పంచ్ లింగన్నగారి సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కంకోల్ చౌరస్తా నుంచి పిల్లోడి గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సన్మానం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని చైతన్య కాలనీలో లో–వోల్టేజ్ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని కాంగ్రెస్ జిల్లా నాయకులు కోల్కూరి విజయభాస్కర్‌రెడ్డి, కాలనీవాసులతో కలసి గత నెలలో కోరగా స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.42లక్షలతో సమస్యను పరిష్కరించారు. దీంతో బుధవారం కాంగ్రెస్ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేష్, బీఎస్పీ శంకర్, జితయ్య, శ్రీనివాస్ రెడ్డిలో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్


వధూవరులులతో ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని శాఫూర్ గ్రామంలో బుధవారం జరిగిన నర్సుగౌండ–నరసమ్మ దంపతుల కుమారుడు మల్లేశం వివాహ వేడుకకు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరై వధూవరులు మల్లేశం, పూజలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి శంకర్, వరము సంఘం వైస్‌చైర్మన్ తుకారాం, ఆలయ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ పాటిల్, నాయకులు శివాజీరావు, యాదవరావు, అంజి, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇక్రిసాట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఇక్రిసాట్ రెండవ గేటు వద్ద కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం స్పందించి కార్మికులకు శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, శాంతమ్మ, రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, పీటర్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మకు పూజలు

మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి గ్రామంలో రేణుకాఎల్లమ్మ అమ్మవారి వార్షికోత్సవంలో భాగంగా చివరి రోజైన బుధవారం భక్తులు నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

సర్కార్ వైద్యం.. మరింత చేరువ

- వట్‌పల్లి మండలానికి పీహెచ్‌సీ మంజూరు
- అందుబాటులో ప్రభుత్వ వైద్యసేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


వట్‌పల్లి గ్రామ వ్యూ (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): ఆరేండ్లుగా ఎదురుచూస్తున్న వట్‌పల్లి మండల ప్రజల పీహెచ్‌సీ కేంద్రం ఏర్పాటు కల నేరవేరింది. మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. నూతనంగా వట్‌పల్లి మండలం ఏర్పాటైననాటి నుంచి పీహెచ్‌సీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతూ ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రాలను సమర్పించారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రభుత్వానికి నివేదికను పంపించడంతో వట్‌పల్లి మండలానికి పీహెచ్‌సీ కల నేరవేరింది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గనున్న దూరభారం

మండల కేంద్రంలో పీహెచ్‌సీ లేకపోవడంతో మండల ప్రజలు ప్రభుత్వ వైద్యం కోసం అందోల్ మండల పరిధిలోని తాలెల్మ పీహెచ్‌సీ, జోగిపేట, శంకరంపేట, సంగారెడ్డి వంటి పట్టణ ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేకపోవడంతో చేసేదేమీలేక ప్రజలు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి జేబులు గుల్ల జేసుకునే పరిస్థితి ఉంది. సరైన వైద్యం అందక అనేక సందర్భాల్లో ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. పీహెచ్‌సీ మంజూరుతో ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల కల నెరవేరినట్లయింది.

వైద్య సేవలు చేరువలోకి...


వట్‌పల్లికి పీహెచ్‌సీ మంజూరు కావడంతో ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువలోకి రానున్నాయి. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఉచిత వైద్య సేవలను పొందే అవకాశం లభించింది. పీహెచ్‌సీ ఏర్పాటును త్వరితగతిన ప్రారంభించాలని మండల ప్రజలు కొరుతున్నారు.

విధివిధానాలు ఖరారు కాలేదు



వట్‌పల్లి మండలానికి ప్రభుత్వం పీహెచ్‌సీని మంజూరు చేసింది. వైద్య సేవల ప్రారంభించే విషయంలో ఏలాంటి విధివిధానాలు ఖరారు కాలేదు. నూతన భవనానికి నిధులను మంజూరు చేస్తారా? లేదా ప్రైవేటు భవనంలో కొనసాగించాలా? అన్న విషయంపై స్పష్టత రాలేదు. వైద్యసిబ్బందిని ఇంకా కేటాయించలేదు.
– సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్, తాలెల్మ పీహెచ్‌సీ

వైద్య రంగానికి పెద్దపీట



ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోంది. వట్‌పల్లి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుపై అడిగిన వెంటనే మంత్రి హరీష్‌రావు మంజూరు చేశారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పీహెచ్‌సీ ఏర్పాటు నా హయాంలో ఏర్పాటు కానుండటం సంతోషంగా ఉంది. అభివృద్ధి విషయంలో అండగా ఉంటున్న మంత్రి హరీశ్‌రావు, సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.
– చంటి క్రాంతికిరణ్, అందోల్ ఎమ్మెల్యే

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


శరణయ్యస్వామి దంపతులకు బహుమతి అందజేస్తున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: విధినిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఖేడ్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ శరణయ్యస్వామి, కండక్టర్ జనార్దన్ పదవి విరమణను పురస్కరించుకొని బుధవారం డిపోలో ఏర్పాటు చేసిన సన్మానసభలో ఆయన మాట్లాడారు. శరణయ్యస్వామి పలుమార్లు ప్రమాదరహిత డ్రైవర్‌గా అవార్డులను అందుకున్నారని గుర్తుచేశారు. శరణయ్యస్వామి దంపతులతో పాటు జనార్దన్‌ను శాలువా పూలమాలలతో సన్మానించారు. మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, మెకానికల్ ఇంజనీర్ దశరథ రావు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం


సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాప్రతినిధులు, అధికారులు గైర్హాజరు

కోహీర్: (జహీరాబాద్) ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం చేపట్టిన భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని వెంకటాపూర్ సర్పంచ్ రాజశేఖర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూ సేకరణ పట్ల చూపిన శ్రద్ధ పరిహారం చెల్లింపులో చూపడం లేదన్నారు. వందలాది మంది రైతులు పరిహారం కోసం ఎదురు చూపులు చూస్తున్నారన్నారు. పరిహారం వివరాలు తమ వద్ద లేవని రెవెన్యూ అధికారి చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారంతో పాటు ఒప్పందం ప్రకారం ఒక ప్లాటు, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం శివారులోని చెరువు ఆక్రమణకు గురవుతున్నదని, శికం భూమి రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కోహీర్ పట్టణంలోని నెలకొన్న తాగునీటి సమస్యను అధిగమించడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ డిమాండ్ చేశారు. సమావేశానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిదులు హాజరు కాకపోవడంతో సమావేశం మొక్కుబడిగా కొనసాగింది. ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, అబ్కారీ, వ్యవసాయ, ఐకేపీ, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. మండలంలో 16 మంది ఎంపీటీసీలు ఉండగా 9 మంది హాజరయ్యారు. 24 మంది సర్పంచులకు ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



రాయికోడ్: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జగదీశ్వర్

పుల్‌కల్(అందోల్): రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ చైతన్య విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రైతువేదికలో రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వామన్ రావు, ఎంపీడీఓ మధులత, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షులు యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి

వట్‌పల్లి(అందోల్): వచ్చే నెల జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ శతాబ్ది ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దారు రాధాబాయి అన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో శతాబ్ది ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఫిరంగి, ఎంపీడీఓ జగదీశ్వర్, ఎస్‌ఐ అంబర్యా, రైతుబంధు అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో...

రాయికోడ్(అందోల్): రాష్ట్రావతర దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్, జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్ అన్నారు. రాయికోడ్‌లోని ఐకేపీ భవనంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో దశాబ్ది ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కలిసి ఉత్సవాలను పండుగ వాతావరణంలో కొనసాగేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రభులు, ఎంపీడీఓ వెంకటేశం, ఏఓ అభినాష్‌వర్మ, ఎస్‌ఐ ఏడుకొండలు, ఆయా శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎస్‌హెచ్‌డీసీ చింతా ప్రభాకర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలపై బుధవారం ఆర్డీవో రవీందర్‌రెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చింతా ప్రభాకర్ హాజరై ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభారోహణలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రంలోని కనకదుర్గ భవానీమాత విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభరోహరణ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్, డాక్టర్ సంజీవరెడ్డి, ఏకాంబ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజ్, వెల్పుగొండ ఆశ్రమ పీఠాధిపతి వెంకటస్వామి మహారాజ్, ఖేడ్ మండల పరిషత్ ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరాచారి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పరమేశ్వర్ పాల్గొన్నారు.

పోషక ఆహారం తీసుకోవాలి

సంగారెడ్డి టౌన్: పోషక ఆహారం తీసుకోవాలని డాక్టర్ సంతోష్‌కుమార్ రెడ్డి, జాన్ పాల్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎమ్మెన్నార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు సిగరెట్లు బీడీ వంటి ఉత్పత్తులతో వచ్చే అనారోగ్య సమస్యలు, నోటిదంత ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. పొగాకును వదిలేసి ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


ద్యాన మందిరానికి శంకుస్థాపన చేస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని నందికంది గ్రామంలోని అతిపురాతనమైన రామలింగేశ్వర ఆలయంలో రూ. 25లక్షలతో నిర్మించనున్న ధ్యాన మందిరానికి సర్పంచ్ కుందెన రాజుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలో ధ్యాన మందిరం నిర్మాణం శుభదాయకమన్నారు. ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ధ్యాన సాధనతో ప్రతిఒక్కరూ తమలోని శక్తిని గ్రహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, ఎంపీటీసీ సునీత సుధాకర్, సర్పంచులు రాజు, నవీన్, కుమార్, అశోక్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, రాజు, శేఖర్, శ్రీనివాస్, సుధాకర్, అంజన్న పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామంలో జూన్ 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతిష్ఠించే నవగ్రహ, బొడ్రాయి, లింగమయ్య, ఊరడమ్మ, గాలి పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనకు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ బుధవారం తనవంతు సాయంగా రూ.50 వేలను గ్రామపెద్దలకు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా మార్కెట్ గంజ్


మార్కెట్ గంజ్‌లో పగిలిన మద్యం బాటిళ్లు

జోగిపేట(అందోల్): జోగిపేటలోని వ్యవసాయ మార్కెట్ గంజ్ మందుబాబులకు అడ్డాగా మారింది. మార్కెట్‌లోని గోడౌన్ ప్రాంతంలో మద్యం సేవించిన తర్వాత ఖాళీ బాటిల్‌లను పగలగొట్టడంతో గాజు పెంకులు ఆ ప్రాంతంలో ఎక్కడబడితే అక్కడ పడడంతో మార్కెట్‌లోకి వచ్చే వారు గాయపడుతున్నారు. మార్కెట్ గంజ్‌లో ఎటువంటి నిఘా లేకపోవడంతో మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. రైతుల వద్ద సేకరించిన వరిధాన్యంను గోడౌన్‌లలో ఉంచడంతో ఆ ధాన్యంను రైస్‌మిల్లులకు తరలించేందుకు వచ్చిన లారీ డ్రైవర్‌లు ఆ ప్రాంతంలోకి వెళ్లిన సమయంలో ఆందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట మార్కెట్ గంజ్‌లో మద్యం సేవించకుండా వ్యవసాయ మార్కెట్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కానిస్టేబుల్ పరీక్షలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

మునిపల్లి(అందోల్): సాంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న 14 మంది విద్యార్థినులు బుధవారం విడుదలైన కానిస్టేబుల్ మెన్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసీన్ తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, కళాశాల బృందం సభ్యులు అభినందనలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థికసాయం అందజేత

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలోని పార్లే ఆగ్రో పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు సికిందర్ కూతురు కీర్తి కొంతకాలంగా బ్లడ్‌కేన్సర్‌తో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు వెంకటేష్ తన మిత్రులతో కలిసి బుధవారం రూ.20 వేలను ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్‌ను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీశైలంచారి, సతీష్, రవి, లక్ష్మణ్, అంజయ్యగౌడ్, ప్రభు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని జంగంపేట గ్రామంలో వీఆర్‌ఏ బోయిని రమేస్ తల్లి లక్ష్మి సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి బుధవారం మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి, రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగు వెంకటయ్య, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వార్డుసభ్యులు శంకరప్ప, నర్సారెడ్డి, నాయకులు గంగారెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): జోగిపేటలోని అరె కటికె సామాజికవర్గానికి చెందిన దుర్గాజి భార్య ఇంది అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి కౌన్సిలర్ చిట్టిబాబు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కటికే శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల స్వీకరణ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హోతి(కె) తెలంగాణ గురుకులంలో తాత్కాలిక పద్ధతిపై బోధించే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, హైస్కూల్‌లో ఇంగ్లీష్, సాంఘీక, సంస్కృతం, బయోలజీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 4 తేదీ లోపు గురుకులంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9908228400 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

◆ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

నారాయణఖేడ్: పట్టణంలోని దత్తాత్రేయ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజున అవాహిక మంటప దేవతారాధన, విగ్రహాలకు విశేష అభిషేకం, ఆవాహిత విగ్రహమూల మంత్రం కార్యక్రమాలను నిర్వహించారు.

◆ 'బీజేపీపై అసత్య ప్రచారం మానుకోవాలి'

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు,హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అసత్య ప్రచారాలను మానుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెమలికొండ వేణుమాధవ్ బుధవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. మంగళవారం రాత్రి సదాశివపేటలో నిర్వహించిన బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీపై ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తేవాలని ఎంఐఎం చూస్తోందన్నారు.

◆ 5 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నారాయణఖేడ్: మండలంలోని చల్లగిద్ద తండాలో నిర్మించిన సేవాలాల్ మహారాజ్ ఆలయంలో జూన్ 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బుధవారం తండాకు చెందిన 50మంది సేవాలాల్ మహారాజ్ భక్తులు దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్ర రమేష్ చౌహాన్ మాట్లాడుతూ మహోత్సవాల్లో భాగంగా 5వ తేదీన బోనాలు, 6న ఆధ్యాత్మిక కార్యక్రమాలు, 7న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేడ్ నియోజకవర్గంలోని గిరిజనులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ కార్యకర్తలతో కాసేపు సరదాగా ఎమ్మెల్యే

వట్‌పల్లి(అందోల్): ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బుధవారం వట్‌పల్లి మీదుగా జహీరాబాద్ వెళ్తూ వట్‌పల్లిలోని ఓ టీస్టాల్ వద్ద ఆగి కార్యకర్తలతో కలిసి టీ తాగుతూ కాసేపు సరదాగా ముచ్చటించాడు. ఈ సందర్భంగా కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నాడు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ బుద్దిరెడ్డి, సర్పంచ్ దీప్లానాయక్, రైతుబంధు అధ్యక్షుడు అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, నాయకులు బస్వరాజ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.


◆ శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని అల్లాదుర్గం సీఐ జార్జ్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండలం రామోజిపల్లిలో కమ్యూనిటీ కనెక్టివిటీ పోగ్రాంలో భాగంగా సైబర్ నేరాలతో పాటు మాదక ద్రవ్యాలకు ప్రజలు అలవాటు పడితే జీవితంలో దుష్పరిమానాలను ఎదుర్కొవాల్సి వస్తుందని, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలు తగ్గుతున్నాయన్నారు. గ్రామంలో సరైన ధృవపత్రాలు లేని పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు బాలరాజు, ప్రవీణ్‌రెడ్డి, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

◆ బీజేపీలో చేరిక

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఎర్రకుంట పంచాయతీ పరిధిలోని బాల్యతండా గిరిజనలు బుధవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగాయిపల్లి గోపి, అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో తండావాసులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు గుండం శంకర్, నగేష్, బాల్ రాజు, మనీ గౌడ్ పాల్గొన్నారు.

అహల్యాబాయికి హోల్కర్‌కు నివాళి


అహల్యబాయికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: రాజమాత అహల్యాబాయి హోల్కర్ జయంతిని బుధవారం పట్టణంలో కురుమ సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అహిల్యాబాయి ఇండోర్ మహారాణిగా ఉన్న సమయంలో దేశంలో అనేక శివాలయాలు నిర్మాణం చేయడంతో పాటు కాశీ విశ్వనాథ, సోమనాథ్ దేవాలయాల నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారని కొనియాడారు. కార్యక్రమంలో కుల సంఘాల నాయకులు శ్రీనివాస్ కన్నా, డాక్టర్ పెద్దగొల్ల నారాయణ, సుభాష్, విశ్వనాథ, దశరథ్, మారుతి, మల్లేశం, లక్ష్మణ్, భీమ్, అశోక్, రమేష్ తుకారాం, మల్లికార్జున్ అఖిలేష్, సోమనాథ్ కలాం, మల్లేష్, చంద్రకళ, మధు, విష్ణు, రాజు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో: బుధవారం రాజమాత అహల్యాబాయి హోల్కర్ 298 జయంతిని కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్గొండ, ఖేడ్ మండల యువత విభాగం అధ్యక్షులు జైపాల్, భీమన్న పాల్గొన్నారు.